క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

వైద్యాధికారి రమేష్ బదిలీ



డీఎంహెచ్ఓను కలిసిన డాక్టర్ రమేష్

పొదలకూరు : మహ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.రమేష్ బదిలీ అయ్యారు. ఈయన జిల్లా ప్రోగ్రామ్ మేనేజింగ్ ఆఫీసర్‌గా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పనిచేయనున్నారు. నాలుగేళ్ల పాటు ఈయన మండల వైద్యాధికారిగా పని చేశారు. ముఖ్యంగా కరోనా సమయంలో విశిష్ట సేవలు అందించారు. బదిలీ అయిన సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్యను రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

‘ఈఎస్సార్’లో ఉచిత కంప్యూటర్ శిక్షణ



నెల్లూరు (టౌన్): మూలాపేటలోని ఈఎస్సార్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణను చైతన్య సారథి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు బిక్కసాని పూర్ణచంద్రరావు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటు లైఫ్ స్కిల్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం ట్రస్ట్ సీఈఓ మోహన్ మాట్లాడారు. 40 మంది అధ్యాపకులతో కంప్యూటర్ శిక్షణను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ట్రస్ట్ డైరెక్టర్ నాగరాజు, ప్రిన్సిపల్ శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో చోరీ

నెల్లూరు రూరల్: మొగళ్లపాళెంలోని రామాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పూజలు చేసేందుకు ఆలయానికి వచ్చిన అర్చకుడు చోరీ జరిగిన అంశాన్ని గుర్తించారు. ఆలయంలోని సీత అమ్మవారి మంగళసూత్రం, వివిధ దేవతామూర్తుల వెండి కిరీటాలు అపహరణకు గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందని అంచనా. స్థానికుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని బొగ్గేరు వద్ద నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ సీఐ బి.నయనతార గురువారం బొగ్గేరు సమీపంలో పట్టుకున్నారు. తొలిసారి కావడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు జరిమానా విధించినట్లు ఆమె తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్నిశాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాల్సి ఉందన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన అవసరం

కొండాపురం: లోక్ అదాలత్ వ్యవస్థపై అవగాహన పెంచుకుని ప్రతి ఒక్కరూ న్యాయం పొందాలని కావలి లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని నేకునాంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో లోక్ అదాలత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మాలకొండారెడ్డి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం మారుతి పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీకృష్ణుని వైభవం

• ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

వెంకటాచలం: వెంకటాచలంలోని రాధే రాధే కృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాధాకృష్ణుల కీర్తనలు ఆలపించి, స్వామివారికి అభిషేకం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిని చాటుకున్నారు. నెల్లూరు శ్రీపీఠం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కృష్ణ మందిరం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మనోజ్‌గుప్తా, మందిపాటి రమేష్, వర్దగల్లు హరిబాబు తదతరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణునికి అభిషేకం

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కృష్ణాష్టమి సందర్భంగా గురువారం విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకం గావించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గీతామందిరంలో..

పొదలకూరు : పట్టణంలోని గీతామందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు స్వామివారికి మేలుకొలుపు, 7.30 గంటలకు గీతాపారాయణం, 8 గంటలకు స్వామికి గ్రామ సంకీర్తన, 10 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, 11.20కి స్వామికి బంగారుపూలతో అష్టోత్తరం, మధ్యాహ్నం 12 గంటలకు మంత్రపుష్పం, 12.15 గంటలకు హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామికి ఊయలసేవ ఏర్పాటు చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులకు కృష్ణుడి వేషం వేసి తల్లిదండ్రులు మురిసిపోయారు.



వెంకటాచలం: అభిషేకం చేస్తున్న భక్తులు



పొదలకూరు : విశేషాలంకరణలో శ్రీకృష్ణుడు



పొదలకూరు : గీతామందిరం..

మిషన్ ఇంద్రధనస్సును విజయవంతం చేయాలి

వెంకటాచలం : గర్భిణులు, పిల్లలకు నూరు శాతం టీకాలు వేసే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి పవిత్ర పిలుపునిచ్చారు. మండలంలోని కసుమూరు పీహెచ్‌సీలో సిబ్బందితో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న పిల్లలు, గర్భిణులకు ప్రతివారం వ్యాధినిరోధక టీకాలు వేస్తున్నామని, కానీ వలస జీవులు, ఎక్కడైనా తప్పిపోయిన పిల్లలను గుర్తించి నూరు శాతం టీకాలు వేసేందుకు ప్రభుత్వం మిషన్ ఇంద్రధనస్సు పేరుతో ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. పీహెచ్‌సీ పరిధిలో సమష్టి కృషితో ఈకార్యక్రమాన్ని నూరుశాతం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ప్రవల్లిక, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారిణి పవిత్ర

నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన

కోవూరు (విడవలూరు) : జాతీయ అంధత్వ నివారణ పక్షోత్సవాల సందర్భంగా విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నేత్రదానంపై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు మోడరన్ కంటి వైద్యశాల డాక్టర్ విష్ణుతేజ నేత్రదానంపై ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. కళ్లు ఉంటేనే ప్రకృతి అందాలను, జీవజాలాన్ని చూడగలమని, మనిషి మరణించిన తరువాత వాటిని దానం చేయడం ద్వారా మరొకరికి కంటిచూపు అందించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుజాత, వైస్ ప్రిన్సిపల్ మధు, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంటి వైద్య నిపుణుడు

గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

• ఐటీడీఏ పీఓ రాణి మందా

మనుబోలు : గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ఐటీడీఏ పనిచేస్తోందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాణి మందా అన్నారు. మనుబోలు సచివాలయం –1ను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చల్లా యానాదులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, వారి వివరాలన్నీ ఉన్నాయా.. అంటూ సచివాలయ సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 38 మండలాల పరిధిలో 1,231 గ్రామాల్లో ఎస్టీలు అధికంగా ఉన్నప్పటికీ వారికి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా? అనే విషయం తెలియడం లేదన్నారు. దీని కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా యాప్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ యానాదుల్లో చాలామందికి ఆధార్ కార్డులు లేవన్నారు. ప్రస్తుతం ఆధార్‌కార్డు లేకుంటే సంక్షేమ పథకాలు అందే అవకాశం లేదన్నారు. దీనివల్ల ఎస్టీలకు ఆధార్ నమోదు చేసేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులకు వెళ్లే విధంగా వారికి అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాలో ఆధార్ కార్డులు లేని 40 వేల యానాదులకు ఇప్పటికే ఆధార్ నమోదు చేయించామని, ఇంకా లక్ష మంది వరకూ ఆధార్ లేని వారు ఉన్నారని భావిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో యానాదుల ఇళ్లను గుర్తించే కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఇది పూర్తయితే ఎవరెవరికి సంక్షేమ పథకాలు అందడం లేదో తెలుసుకుని వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ఆమె సచివాలయ రికార్డులను పరిశీలించారు.



రికార్డులు పరిశీలిస్తున్న రాణి మందా

ఆక్వా ఉత్పత్తులకు అనుమతులు తప్పనిసరి

• ఎఫ్‌డీఓ సంజయ్ స్టీఫెన్



ముత్తుకూరు : ఆక్వా సాగుదారులు, ఆక్వా ఉత్పత్తిదారులు, సీడ్–ఫీడ్ అమ్మకం దారులు, ప్రాసెసింగ్ ప్లాంటుదారులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ అథారిటీ –2020 చట్టం ద్వారా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎఫ్‌డీఓ సంజయ్‌స్టీఫెన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్వా సంబంధంలేని వెటర్నరీ గ్రేడ్ మందులు, నిషేధిత యాంటీబయాటిక్స్ విక్రయించడం నేరమని తెలియజేశారు. ఆక్వా రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలన్నారు. లేకుంటే అధికారులు తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. లైసెన్సులు పొందేందుకు సమీపంలోని గ్రామ సచివాలయాల్లో ఉన్న మత్స్య సహాయకులు, మత్స్యశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

ముగిసిన బీమా వారోత్సవాలు

• విద్యార్థులకు బహుమతుల అందజేత

ఆత్మకూరు: ఎల్‌ఐసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీమా వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ మెహ్రాకుమార్ మాట్లాడుతూ దేశంలోని అతి పెద్ద బీమా సంస్థ ఎల్‌ఐసీ అని, ప్రజల ఆరోగ్య, జీవిత భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే ఎల్‌ఐసీ 68 శాతం ప్రీమియంలు, 78 శాతం పాలసీలతో మార్కెట్‌లో అగ్రభాగాన ఉందన్నారు. వారోత్సవాల్లో భాగంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి ఏవీ రమణయ్య, సిబ్బంది టి.రమేష్, ప్రవీణ, మన్సూర్, నరసింహారెడ్డి, డీఓ కామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



నేడు గ్రామాల్లో మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం వెంకటాచలం మండలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు తాటిపర్తి పాళెం గ్రామంలో, 12 గంటలకు ఇడిమేపల్లిలో గ్రామ సచివాలయాలను ప్రారంభిస్తారని తెలియజేశారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎర్రగుంట వద్దనున్న కమ్యూనిటీ హాలులో నూతనంగా మంజూరైన పెన్షన్ నగదును లబ్ధిదారులకు అందిస్తారన్నారు.

పిడతాపోలూరులో..

ముత్తుకూరు : మండలంలోని పిడతాపోలూరు గ్రామానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఉదయం వస్తారని మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు.

పంచాయతీ సెక్రటరీకి ఈఓపీఆర్డీగా పదోన్నతి

పొదలకూరు : పొదలకూరు మేజర్ పంచాయతీ సెక్రటరీ ఎస్‌కే అల్లాభక్షుకు ఈఓపీఆర్డీగా పదోన్నతి లభించింది. ఈయన పొదలకూరు గ్రేడ్–1 సెక్రటరీగా నాలుగేళ్ల పాటు పనిచేశారు. సీనియారిటీ జాబితా ప్రకారం అల్లాభక్షు పదోన్నతి పొందారు. ఈఓపీఆర్డీగా తిరుపతి జిల్లా గూడూరు డివిజన్‌కు కేటాయించారు.

నగదు ఇవ్వలేదని హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదన్న అక్కసుతో ఓ వ్యక్తిని కత్తితో పొడిచిన ఘటనలో నిందితుడిపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. మన్సూర్‌నగర్ మూడోవీధిలో పి.కుమార్ నివాసం ఉంటున్నాడు. అతను పొర్లుకట్ట సమీపంలోని ఓ వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు. ఈనెల ఆరో తేదీన తన స్నేహితుడు ఇస్మాయిల్‌తో కలిసి టీ తాగేందుకు పొర్లుకట్ట సబ్‌స్టేషన్ సమీపంలోని షాపునకు వెళ్లాడు. టీ తాగుతుండగా అదే ప్రాంతానికి చెందిన భక్షు మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలని కుమార్‌ను అడిగాడు. ఆయన లేవని చెప్పడంతో కోపోద్రిక్తుడైన భక్షు తనవద్దనున్న కత్తితో కుమార్‌పై విచక్షణారహితంగా దాడిచేసి పరారయ్యాడు. గాయాలపాలైన కుమార్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన



నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం పరిశీలించారు. వెంకటేశ్వరపురంలోని గాంధీ గిరిజన కాలనీ, ఇసుక డొంక, రంగనాయకులపేట, తదితర ప్రాంతాల్లోని మున్సిపల్ పాఠశాలల్లో ఏర్పాట చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, తదితరాలను కల్పించాలని ఆదేశించారు. సిటీ ప్లానర్ దేవీకుమారి పాల్గొన్నారు.

ఘనంగా వేళాంగణిమాత మహోత్సవాలు



తేరు ప్రదక్షిణలో వేళాంగణిమాత అమ్మవారు

తోటపల్లిగూడూరు : కోడూరులోని వేళాంగణిమాత జన్మదిన మహోత్సవాలు రెండో రోజు గురువారం వేడుకగా సాగింది. ఫాదర్ లూకాస్‌రాజ్ ఆధ్వర్యంలో చర్చిలో ఆరాధన–స్వస్తత ప్రార్థనలు, జపమాల నవదిన ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా ఫాదర్ లూకాస్‌రాజ్ మాట్లాడుతూ వేళాంగణిమాత(మరియమాత) భక్తుల పాలిట పెన్నిధి అని, ఆమె అన్ని మతస్తుల వారికి ఆరాధ్య దైవమన్నారు. మతాలకతీతంగా అందరూ ఆమెను సేవిస్తారన్నారు. కాగా సాయంత్రం వేళాంగణిమాత అమ్మవారికి దివ్యబలిపూజ వేడుకగా జరిగింది. అనంతరం చర్చి నుంచి కొత్తకోడూరు వరకు వేళాంగణిమాత తేరు ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. జిల్లా నలువైపుల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చి వేళాంగణిమాతను దర్శించుకున్నారు. అనంతరం కోడూరు సాగరతీరంలో సముద్ర స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు.

అమ్మవారి జయంతి నేడు

వేళాంగణిమాత మహోత్సవాల్లో భాగంగా నేడు అత్యంత కీలకమైన రోజు. సెప్టెంబర్ 8వ తేదీ అమ్మవారి జయంతి కావడంతో చర్చిలో ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం 6 నుంచి ఉత్సవాల్లో ముఖ్య ఘట్టమైన అమ్మవారి దివ్యబలిపూజ కార్యక్రమం మొదలవుతోంది. రాష్ట్ర నలువైపుల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండడంతో చర్చి డైరెక్టర్ ఫాదర్ లూకాస్‌రాజ్ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

హెచ్ఐవీ, టీబీలపై అవగాహన కల్పించాలి

బుచ్చిరెడ్డిపాళెం: ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి హెచ్ఐవీ, టీబీ, కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా క్షయ, ఎయిడ్స్ అండ్ లెప్రసీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలియజేశారు. మండలంలోని జొన్నవాడలో ఉన్న పీహెచ్‌సీని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా హెచ్ఐవీ, టీబీ వ్యాధులతో పాటు కుష్టు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తే వ్యాధి సోకకుండా చర్యలు తీసుకోవచ్చని వివరించారు. ఇప్పటికే హెచ్ఐవీ, టీబీ, కుష్టు వ్యాధులు ఉన్న వారికి తగిన సూచనలిస్తూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకునే విధంగా ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి స్థానిక సమస్యలపై ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యుడు అహ్మద్‌బాబు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

టీడీపీ నేతకు పింఛన్ మంజూరు

పొదలకూరు : సంక్షేమ పథకాల అమల్లో కులం, మతం, పార్టీలు చూడకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచూ అంటుంటారు. అందుకు నిదర్శనంగా మండలంలోని మర్రిపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వెంపులూరు పుల్లయ్యగౌడ్‌కు ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ మంజూరు చేసింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు పింఛన్ మంజూరయ్యేందుకు సహకరించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సైతం పార్టీలు చూడకుండా గ్రామాల్లో పింఛన్లు మంజూరయ్యేందుకు సహకరించాల్సిందిగా నాయకులు, కార్యకర్తలకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పుల్లయ్యగౌడ్ ఇంటికి వలంటీరుతో కలిసి వెళ్లిన నాయకులు గురువారం పింఛన్ నగదు రూ.2,750 అందజేశారు. ఆయన సతీమణి రమణమ్మ కిడ్నీసమస్యతో బాధపడుతుండగా డయాలసిస్ పేషెంట్ కింద రూ.10 వేల పింఛన్ పొందేవారు. మూడు మాసాల కిందట రమణమ్మ మృతి చెందారు. కాగా పుల్లయ్యగౌడ్ కుమారుల్లో ఒకరు ఇప్పటికీ మండల టీడీపీ బీసీ సెల్ నాయకుడిగా కొనసాగుతున్నారు.



పుల్లయ్యగౌడ్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పోషకాహారంతో రక్తహీనత దూరం



పౌష్టికాహార కిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ వజ్రమ్మ, సీడీపీఓ విజయలక్ష్మి

మనుబోలు : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని ఎంపీపీ గుండాల వజ్రమ్మ అన్నారు. పోషణ్ మహా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని జట్లకొండూరు అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓతో కలిసి పౌష్టికాహారంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందజేస్తోందన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పోషకాహారంలో అన్ని పోషక విలువలు ఉంటాయన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం ద్వారా గర్భిణులకు సహజ కాన్పు అయ్యేందుకు దోహదపడుతుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారం ఎలా తయారు చేయాలో సూపర్‌వైజర్ రమణమ్మ వివరించారు. ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం తన సొంత ఖర్చులతో కోడిగుడ్లు అందజేశారు. అనంతరం వైఎస్సార్ పౌష్టికాహార కిట్లను అందించారు. అంగన్‌వాడీలు సుబ్బరామమ్మ, సంతోషమ్మ, సురేఖ, సౌమ్య, శేషమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి

మనుబోలు : తమ గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మండలంలోని వెంకన్నపాళెం దళితులు గురువారం తహసీల్దార్ శివ కృష్ణయ్యను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని దళితవాడలో 150 కుటుంబాలు నివాసముంటున్నాయని తెలిపారు. గత 20 ఏళ్లుగా ఇక్కడ ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్నామని, అయితే మూడేళ్ల క్రితం ఇద్దరు వ్యక్తులు విగ్రహాన్ని ధ్వంసం చేశారని తెలియజేశారు. అప్పటి నుంచి దళితవాడ ఏదో ఒక సమస్యగా మారిందన్నారు. దీంతో దళితవాడలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. అయితే దళితవాడలో 15 కుటుంబాల వారు ఓ గ్రూపుగా ఏర్పడి విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటున్నారని తెలిపారు. 90 శాతం మంది విగ్రహ ఏర్పాటుకు సుముఖంగా ఉన్నందున అనుమతి ఇవ్వాలని కోరారు.



విగ్రహ ఏర్పాటుపై తహసీల్దార్‌తో మాట్లాడుతున్న దళితులు